www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 8 జనవరి 2025
5
ఏలూరు



12వ తేదీ వరకూ ఎస్సి కుల గణనపై
అభ్యంతరాల స్వీకరణ : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

ఎస్సి కులగణనపై నిర్వహిస్తున్న అభ్యంతరాల (ఆడిట్ ప్రక్రియ) స్వీకరణ గడువును ఈ నెల 12వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మంగళవారం తెలిపారు. ఎస్‌సి విధివిధానాలు తెలుపుతూ ప్రభుత్వం జి.ఒ. నెం.265 విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఈ నెల 12వ తేదీ వరకు కులగణనపై నిర్దేశిత ప్రాంతాల్లో సంబంధిత అధికారులు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారని తెలిపారు. స్వీకరించిన వివరాలను ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా 16వ తేదీ వరకు అధికారులు నమోదు చేస్తారని, అనంతరం అన్ని తనిఖీలు పూర్తి చేసి తుది కులగణన సర్వే వివరాలను ఈ నెల 20న గ్రామ, వార్డు సచివాలయాల వద్ద విడుదల చేస్తారని వెల్లడించారు. మండల ప్రత్యేక అధికారులు సంబంధిత ప్రక్రియను పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

జెడ్‌పి తీర్మానాలు.. ఆమోదం పొందేనా..!

నేడు జెడ్‌పి స్టాండింగ్ కమిటీ సమావేశాలు
కోరం లేక గతేడాది నవంబర్ 8న సమావేశాలు రద్దు
డిసెంబర్ 21న జెడ్‌పి ప్రత్యేక సమావేశంలోనూ ఛైర్‌పర్సన్‌పై వైసిపి సభ్యుల తిరుగుబాటు
స్టాండింగ్ కమిటీల్లో తీర్మానాలను వ్యతిరేకించేందుకు వ్యూహం
తీర్మానాలు ఆమోదం పొందకపోతే జెడ్‌పి పనులకు విఘాతమే

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలపై ఉత్కంఠ నెలకొంది. జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీపై తిరుగుబాటు ధోరణితో వైసిపి సభ్యులు ఉండటంతో బుధవారం జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశాలు సవ్యంగా సాగుతాయా అనే అనుమానాలు నెలకొన్నాయి. ఒకవేళ సమావేశానికి హాజరైనా తీర్మానాలను వ్యతిరేకించే ఆలోచనలో వైసిపి సభ్యులు ఉన్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే జిల్లా పరిషత్ అభివృద్ధి పనులపై తీవ్ర ప్రభావం ఏర్పడనుంది. జిల్లా పరిషత్‌లో మొత్తం ఏడు స్టాండింగ్ కమిటీలు ఉన్నాయి. ఒక్కో కమిటీలో తొమ్మిది మంది, కొన్ని కమిటీల్లో 12 మంది సభ్యులు ఉన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఎంఎల్‌ఎలు, ఎంపీలు సైతం స్టాండింగ్ కమిటీలో సభ్యులుగా ఉంటారు. నిబంధనల ప్రకారం 60 పని దినాల్లో స్టాండింగ్ కమిటీ సమావేశాలు, 90 పనిదినాల ఆధారంగా జెడ్‌పి సర్వసభ్య సమావేశం జరపాల్సి ఉంటుంది. 2024 నవంబర్ ఎనిమిదో తేదీ జరగాల్సిన స్టాండింగ్ కమిటీ సమావేశాలు కోరం లేక రద్దయ్యాయి. దీంతో అనేక బిల్లులకు సంబంధించి తీర్మానాలు ఆమోదం పొందని పరిస్థితి నెలకొంది. 60 రోజులు పూర్తవ్వడంతో మరోసారి స్టాండింగ్ కమిటీ సమావేశాలు బుధవారం నిర్వహించేందుకు జిల్లా పరిషత్ సిఇఒ నోటిఫికేషన్ విడుదల చేశారు. బుధవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి స్టాండింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించనున్నారు. స్టాండింగ్ కమిటీ సమావేశాలు జరగాలంటే ప్రతి కమిటీకి కోరం ఉండాలి. 12 మంది సభ్యుల్లో కనీసంగా నలుగురు, తొమ్మిది మంది సభ్యులు ఉంటే ముగ్గురు హాజరైతేనే కోరం ఏర్పడి సమావేశాలు జరుగుతాయి. జిల్లా పరిషత్ నిధుల ఖర్చుకు సంబంధించిన బిల్లులు ఏవైనా స్టాండింగ్ కమిటీలో ఆమోదం పొందాలి. కరెంటు బిల్లులకు సైతం ఆమోదం తెలిపితేనే ఖర్చు చేసేందుకు వీలుంటుంది. అంతేకాకుండా ఈ సమావేశాలకు జిల్లా అధికారులంతా హాజరవుతారు. ఆయా శాఖలవారీగా జరగబోయే అభివృద్ధి పనులపై చర్చించి తీర్మానాలు చేయాల్సి ఉంటుంది. వైసిపి సభ్యులు స్టాండింగ్ కమిటీ సమావేశాలకు హాజరవుతారా అనే అనుమానాలు నెలకొన్నాయి. సమావేశాలకు హాజరైనా తీర్మానాలను వ్యతిరేకించాలనే ఆలోచనలో వైసిపి సభ్యులు ఉన్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే మరోసారి రాజకీయ రగడ పెరిగే అవకాశం ఉంటుంది. తీర్మానాలు ఆమోదం పొందకపోతే పరిస్థితి తీవ్రరూపం దాల్చే పరిస్థితి ఏర్పడనుంది. ఈ పరిస్థితికి ప్రధాన కారణం జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ టిడిపిలో చేరడమే అనే చర్చ సాగుతోంది.


జిల్లా పరిషత్ కార్యాలయం

జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీపై వైసిపి సభ్యులు గుర్రు..

జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ వైసిపిని వీడి టిడిపి తీర్థం పుచ్చుకోవడంపై జిల్లా పరిషత్‌లో రాజకీయ గలాట మొదలైంది. జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ టిడిపిలోకి వెళ్లడాన్ని వైసిపి సభ్యులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్‌లో 48 మంది జెడ్‌పిటిసిలకుగాను 46 మంది వైసిపి సభ్యులే ఉన్నారు. యలమంచిలి జెడ్‌పిటిసి కవురు శ్రీనివాస్ ఎంఎల్‌సిగా ఎన్నికవడంతో ప్రస్తుతం 45 మంది వైసిపి జెడ్‌పిటిసిలు ఉన్నారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్‌ను పదవి నుంచి తప్పించాలని వైసిపి సభ్యులు పట్టుబట్టి జెడ్‌పి సిఇఒ, జిల్లా కలెక్టర్‌కు సైతం వైసిపి సభ్యులు వినతిపత్రాలు అందించారు. అనేక పర్యాయాలు అనంతరం ఎట్టకేలకు 2024 డిసెంబర్ 21న జిల్లా పరిషత్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో 38 మంది జెడ్‌పిటిసిలు పాల్గొన్నారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ తీరును అంతా తప్పుబట్టిన పరిస్థితి ఉంది. అయితే చట్టప్రకారం అవిశ్వాస తీర్మానం పెట్టడానికిగాని, అనర్హత వేటుకుగాని అవకాశాలు లేవని జిల్లా పరిషత్ సభ్యులకు తెలియపర్చి సిఇఒ సమావేశం ముగించారు. అయితే అదే రోజు మధ్యాహ్నం నుంచి జరిగిన జెడ్‌పి సర్వసభ్య సమావేశంలో వైసిపి సభ్యులు వ్యతిరేకించడంతో కోరం లేక గంటపాటు సమావేశం నిలిచిపోయింది. ఎట్టకేలకు 17 మంది సభ్యులు సంతకాలు చేయడంతో కోరం పూర్తయ్యి సమావేశం సాగింది. సంతకాలు చేసిన వారిలో 15 మంది వైసిపి సభ్యులు ఉన్నారు. ప్రస్తుత స్టాండింగ్ కమిటీ సమావేశాలకు వైసిపి సభ్యులు హాజరైనా తీర్మానాలను వ్యతిరేకించాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే జెడ్‌పి రాజకీయం మరింత వేడెక్కనుంది. వైసిపి సభ్యులు జెడ్‌పి ఛైర్‌పర్సన్‌కు అనుకూలంగా ముందుకు సాగితే మాత్రం అంతా సాఫీగా సాగిపోనుంది.

'పెసా' ఎన్నికలు ప్రశాంతం, ఏకగ్రీవం

పలుచోట్ల కోరం లేక వాయిదా: నేడు, రేపు మిగిలిన గ్రామాల్లో ఎన్నికలు


జీలుగుమిల్లిలో పెసా కమిటీ ఎన్నికకు వచ్చిన ఓటర్లు, కోరం లేక వాయిదా

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పెసా గ్రామసభ ఉపాధ్యక్ష, కార్యదర్శుల ఎన్నికలు మండలంలో మొదటి రోజు మంగళవారం పది గ్రామాల్లో జరగాల్సి ఉండగా ఆరు గ్రామాల్లో కోరం లేక వాయిదా పడ్డాయి. నాలుగు గ్రామాల్లో ఎన్నిక జరిగినట్లు ఎన్నికల అధికారి నిఖిల్ మధుకరణ్ తెలిపారు. జీలుగుమిల్లి, దర్భగూడెం, లక్ష్మీపురం, పాత చీమలవారి గూడెం, కామయ్యపాలెం, గంగన్నగూడెం గ్రామాల్లో ఎన్నికలు నిలిచిపోయాయి. అంకన్నగూడెం పెసా గ్రామసభ ఉపాధ్యక్షులుగా కారం సీత, కార్యదర్శిగా తాటి గంగులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దిబ్బగూడెంలో ఉపాధ్యక్షులుగా బేతి చిట్టిబాబు, కార్యదర్శిగా చోడెం కన్నప్పరాజు, పూచికపాడులో ఉపాధ్యక్షులుగా రాజన రవి, కార్యదర్శిగా టి.సందీప్, రెడ్డిగూడెంలో ఉపాధ్యక్షునిగా బి.విశ్వనాథ్‌రెడ్డి, కార్యదర్శిగా కె.శ్రీనివాస రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఇఒపిఆర్‌డి నిఖిల్ మధుకరణ్ తెలిపారు.


దిబ్బగూడెం పెసా గ్రామసభ కార్యదర్శి కన్నప్పరాజు

బుట్టాయగూడెంలో 17 కమిటీల ఎన్నిక, 3 గ్రామాల్లో వాయిదా

బుట్టాయగూడెం: మండలంలో పెసా కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. బుధవారం మండలంలో 20 గ్రామాలకు పెసా కమిటీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా 17 గ్రామాలకు మాత్రమే ఎన్నికలు జరిగాయి. మిగిలిన మూడు గ్రామాలు బుట్టాయగూడెం, అచ్యుతాపురం, తెల్లంవారిగూడెం కోరం లేని కారణంగా ఎన్నికలు జరగలేదు. రెడ్డిగణపవరం గ్రామ పంచాయతీ పరిధిలో బెదడనూరు పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా కురసా బాలకృష్ణ, కార్యదర్శిగా కారం దుర్గారావు, అంతర్వేదిగూడెం పంచాయతీ పరిధిలో గాడిద బోరు పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా కుంజా లక్ష్మణ్, కార్యదర్శిగా కారం ముత్యాలరావు, పందిరిమామిడిగూడెం పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా ఉమ్మిట్టి వెంకటరెడ్డి, కార్యదర్శిగా కర్నెల కృష్ణారెడ్డి, నాగులగూడెం కమిటీ ఉపాధ్యక్షులుగా వాసం శేఖర్, కార్యదర్శిగా మడకపాటి మంగారావు, అంతర్వేదిగూడెం పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా కొమరం మల్లేశ్వరరావు, కార్యదర్శిగా కొవ్వాసు మంగరాజు, దొరమామిడి గ్రామ పంచాయతీ పరిధిలో వీరమ్మగూడెం పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా గోగుల రమేష్, కార్యదర్శిగా గురుగుంట్ల లచ్చిరెడ్డి, చిన్న జీడిపూడి పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా కొమరం కొండయ్య, కార్యదర్శిగా మడకం చలపతిరావు, గుబ్బసమామిడి పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా ఉడతా వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా చోడెం వెంకటేశ్వరరావు, దొరమామిడి పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా ముచిక కృష్ణ, కార్యదర్శిగా కొమరం నాగార్జునరావు, గురుగుపల్లి పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా కాకర కన్నారావు, కార్యదర్శిగా కట్టం వెంకటస్వామి, బుట్టాయగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో సూర్యవారిగూడెం పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా కొమరం బాలకృష్ణ, కార్యదర్శిగా మొట్టం వసంతరావు, రేగులగుంట పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా చూడెం వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా కంగాల రాజు, అలివేరు పంచాయతీ పరిధిలో అలివేరు పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా కప్పల పోతిరెడ్డి, కార్యదర్శిగా గోగుల సురేష్, రేగులపాడు పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా కరకాల నవీన్‌రావు, కార్యదర్శిగా గురుగుంట్ల మహేష్‌రెడ్డి, లంకపాకల పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా చింతల మహేష్, కార్యదర్శిగా కప్పల మంగిరెడ్డి ఎన్నికయ్యారు. ఈ 20 గ్రామాలకుగాను 17 గ్రామాల్లో పెసా కమిటీ ఎన్నికలు నిర్వహించామని, మిగిలిన 45 గ్రామాల్లో పెసా కమిటీ ఎన్నికలు నిర్వహిస్తామని బుట్టాయగూడెం ఎంపిడిఒ జ్యోతి తెలిపారు.

పోలవరం: మండలంలో మంగళవారం జరిగిన పెసా కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ఏకగ్రీవంగా జరిగినట్లు ఎంపిడిఒ ఇ.శ్రీనివాస్ తెలిపారు. చేగొండపల్లి పంచాయతీ ఉడలపల్లి గ్రామ సభ ఉపాధ్యక్షులుగా మాలెం సూర్యదొర, కార్యదర్శిగా తుమ్మల బాలరెడ్డి, చేగొండపల్లి ఉపాధ్యక్షులుగా ముచ్చిక చెల్లయ్యదొర్, కార్యదర్శిగా మిడియం రవిదొర, మెట్లపాకల ఉపాధ్యక్షులుగా మడకం శ్రీనివాసరావు, కార్యదర్శిగా మడకం సురేష్, శింగన్నపల్లి ఉపాధ్యక్షులుగా బొరగం శివాజీ, కార్యదర్శిగా బొరగం రాజేష్, ధార్వాడ ఉపాధ్యక్షులుగా కెచ్చెల ముత్యాలరెడ్డి, కార్యదర్శిగా కెచ్చెల శివారెడ్డి, చిలకలూరు ఉపాధ్యక్షులుగా వేట్ల రాజారెడ్డి, కార్యదర్శిగా వేట్ల రెడ్డిబాబు, గిన్నెపల్లి ఉపాధ్యక్షులుగా మాండ్రు బుల్లబ్బాయ్, కార్యదర్శిగా చింతల కిశోర్‌బాబురెడ్డి, తంగేడుకొండ ఉపాధ్యక్షులుగా సూండ్రు విశ్వనాథ్, కార్యదర్శిగా వేట్ల చిన్నారెడ్డి, గెడ్డపల్లి ఉపాధ్యక్షులుగా చింతల శ్రీనివాసరెడ్డి, కార్యదర్శిగా మాండ్రు ముసలారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.

స్వయం ఉపాధి పథకాలకు ప్రాధాన్యతివ్వాలి

నిర్దేశిత రుణ మంజూరు లక్ష్యాలను పూర్తి చేయాలి
బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు



జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బిసి, ఎస్‌సి కార్పొరేషన్ల యాక్షన్ ప్లాన్ కింద స్వయం ఉపాధి పథకాల మంజూరులో బ్యాంకర్లు వారికి కేటాయించిన రుణ లక్ష్యాలను త్వరతగతిన పూర్తి చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశపు హాలులో మంగళవారం బ్యాంకర్ల సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత పెంపొందించేందుకు కృషి చేయాలని, ఈ కార్యక్రమంలో భాగంగా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పథకాల కల్పనలో సంబంధిత శాఖలు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో బిసి, కార్పొరేషన్ 2024-25 యాక్షన్ ప్లాన్ ద్వారా వెనుకబడిన తరగతులకు చెందిన యువతకు ఒబిఎంఎంఎస్ స్వయం ఉపాధి పథకంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1901 స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు రూ.36.49 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు ఒబిఎంఎంఎస్ స్వయం ఉపాధి పథకం ద్వారా 215 మంది యువతకు యూనిట్లు రూ.4.30 కోట్లతో జిల్లాకు మంజూరయ్యాయన్నారు. బిసి నిరుద్యోగ యువకులకు 38 జనరిక్ మెడికల్ షాపుల యూనిట్లు రూ.3.04 కోట్లతో జిల్లాకు మంజూరయ్యాయన్నారు. యూనిట్ వ్యయంలో 50 శాతం బ్యాంకర్లు రుణాలుగా మంజూరు చేస్తారని, రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం సబ్సిడీగా అందిస్తుందని అన్నారు. ఎస్‌సి కార్పొరేషన్ 2024-25 యాక్షన్ ప్లాన్ ద్వారా ఎస్‌టిలకు చెందిన యువతకు స్వయం ఉపాధి పథకంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.25.91 కోట్లతో 750 స్వయం ఉపాధి పథకం యూనిట్లు జిల్లాకు మంజూరయ్యాయన్నారు. ఈ పథకంలో లబ్ధిదారుడు 10 శాతం తన వాటాగా చెల్లించాల్సి ఉంటుందని, బ్యాంకర్లు 50 శాతం రుణాలు అందిస్తారని, ప్రభుత్వం 40 శాతం సబ్సిడీగా అందిస్తుందని తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తులను మండలస్థాయిలో ఎంపిడిఒలు పరిశీలించి, అర్హుల దరఖాస్తులను సంబంధిత శాఖలకు పంపిస్తామని చెప్పారు. బ్యాంకర్లు తమకు కేటాయించిన లక్ష్యాలను అనుసరించి రుణాలు మంజూరు చేసి నిరుద్యోగ యువత స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్వయం ఉపాధి పథకాల యూనిట్లు ఏర్పాటు చేసే యువతకు దరఖాస్తు దగ్గర నుండి యూనిట్ ఏర్పాటు వరకు వారికి అవసరమైన సహకారం అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. బ్యాంకర్ల వద్ద దరఖాస్తులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు రుణాలు మంజూరు చేసేలా అధికారులు బ్యాంకర్లతో సమన్వయంతో పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు, బిసి కార్పొరేషన్ ఇడి పుష్పమణి, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జయప్రకాశ్, ఎల్‌డిఎం నీలాద్రి, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మహిళా సమాఖ్య జిల్లా సభ్యులు


ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో నూతనంగా ఎన్నికైన జిల్లా సమాఖ్య, ఏలూరు జిల్లా పాలకవర్గ సభ్యులు మంగళవారం కలెక్టరేట్లో కలెక్టర్ కె.వెట్రిసెల్విని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘ సభ్యులు తయారు చేసే ఉత్పత్తులు ఇ-కామర్స్ ద్వారా మార్కెటింగ్ జరిగేలా చూడాలని, ఉల్లాస్ కార్యక్రమంలో పాల్గొని వయోజన విద్య కోసం మరింత కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, జిల్లా సమాఖ్య అధ్యక్షులు పూసం గంగారత్నం, ఉపాధ్యక్షురాలు ఆవుల స్వర్ణకుమారి, కార్యదర్శి తోట కృపామణి, సహాయ కార్యదర్శి సయ్యద్ సుల్తానా, కోశాధికారి గోళ్ల శాంత కుమారి పాల్గొన్నారు.

వీధి కుక్కల బెడద అరికట్టాలని వినతి

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని మూలలంకలో వీధి కుక్కల బెడద అరికట్టాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గ్రామ సచివాలయ సిబ్బందికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. పాదచారులు, వాహనదారులపై వీధి కుక్కలు దాడి చేసి గాయపరుస్తున్నాయని, కొన్ని పిచ్చి కుక్కలుగా మారి సంచరిస్తున్నందున అవి చిన్న పిల్లలపై దాడి చేసే ప్రమాదం ఉన్నందున చర్యలు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఎస్ఎన్‌వి.సత్యనారాయణ, కడగాని రమేష్, బి.పెద్దిరాజు, వీర చంటి పాల్గొన్నారు.


వినతి అందిస్తున్న నేతలు

కోడిపందేల నిర్వహణ నేరం

నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు - కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

కోడి పందేలు నిర్వహించడం నేరమని, నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని తన ఛాంబర్‌లో మంగళవారం కోడిపందేల నిషేధ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ సంక్రాంతి సమయంలో జిల్లాలో సంప్రదాయ, చట్టవిరుద్ధమైన కోడిపందేలను నిరోధించే ప్రయత్నాలను ముమ్మరం చేయాలని అన్నారు. నిషేధం అమలుకుగాను పశుసంవర్ధక శాఖ అధికారులు, స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులతో కూడిన ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బృందాలు గ్రామ స్థాయిలో జరుగుతున్న కోడిపందేల నిర్వహణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తాయన్నారు. పందేలు నిర్వహించకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవడం, నిర్వహించే వారిపై కేసులు నమోదు చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ టి.గోవిందరాజు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు డాక్టర్ హర్ష, డాక్టర్ జాహ్నవి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్, అధికారులు

సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులుగా ప్రసాద్, కనకారావు

ఏలూరు అర్బన్ : ఏలూరు నగరంలో కార్మికుల సమస్యలపై సమరశీల పోరాటాలు చేస్తామని నూతనంగా ఎన్నికైన సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు వివిఎన్.ప్రసాద్, వైఎస్.కనకారావు అన్నారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో వీరి ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి ప్రసాద్ మాట్లాడుతూ ఏలూరు నగరంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆందోళన, పోరాటాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. మున్సిపల్, అంగన్వాడీ, ఆశ, కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జె.గోపి, జి.రవి కిషోర్, రజిని, పి.హైమావతి, దేవి నూతన అధ్యక్ష, కార్యదర్శులకు అభినందనలు తెలియజేశారు.



ప్రసాద్, కనకారావు

నాణ్యతలేని రోడ్ల నిర్మాణం

కాంట్రాక్టర్లుగా తెలుగు తమ్ముళ్లు
వేసిన సీసీ రోడ్డుపైనే మరొక సీసీ రోడ్డు
రూ.18 లక్షల దుర్వినియోగం
భారీగా పక్కదారి పట్టిన ఉపాధి హామీ నిధులు


గాంధీ ఆశ్రమం దగ్గర ప్రభుత్వ అనుమతుల మేరకు వేయాల్సిన రోడ్డు

ప్రజాశక్తి - మండవల్లి

కూటమి నాయకుల వింత పోకడలు ప్రజలను విస్మయానికి గురి చేస్తున్నాయి. టిడిపి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకు వచ్చినందుకు ఫలితాన్ని ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. బదులుగా కాంట్రాక్ట్ పనులను చేజిక్కించుకొని, నాసిరకంగా రోడ్లను నిర్మిస్తూ లక్షల రూపాయలు దండుకుంటున్నారు. అధికారులు కూడా లక్షల్లో సొమ్ము చేసుకుని చూసి చూడనట్లు వ్యవహరిస్తూ సహకరిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. అవినీతి అధికారుల అండదండలతో మరొక అడుగు ముందుకు వేసి సీసీ రోడ్డుపైనే సీసీ రోడ్డు నిర్మించి లక్షల రూపాయలను స్వాహా చేసేస్తున్నారు. దీంతో గాంధీ ఆశ్రమానికి వెళ్లే రహదారి అభివృద్ధి చెందకపోగా, ప్రభుత్వ ఆశయానికి తూట్లు పొడుస్తూ కోట్ల రూపాయల ఉపాధి హామీ నిధులను దారి మళ్లిస్తున్నారనే విమర్శలు బహిరంగంగానే గుప్పుమంటున్నాయి.

గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిచోట సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తలచారు. ఇందుకోసం ఎమ్‌జిఎన్‌ఆర్‌ఇజిఎస్ పథకంలో నిధులను సేకరించి ప్రతి నియోజకవర్గానికి అవసరమైన రోడ్లను నిర్మించేందుకు నిధులను కేటాయించారు. మండవల్లి మండలానికి 66 రోడ్లు, ఒక కాంపౌండ్ వాల్ నిర్మాణం నిమిత్తం రూ.456.80 లక్షల నిధులను మంజూరు చేశారు. మండవల్లిలో రెండు డ్రెయిన్లతో కూడిన 7 సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.51.50 లక్షల విధులు మంజూరయ్యాయి. మండవల్లి మండలంలో ఎక్కడ ఎక్కడ రోడ్లు నిర్మించాలి అనేదానిపై గ్రామ సభలను కూడా నిర్వహించడం జరిగింది. మండవల్లిలో నిర్వహించిన గ్రామసభలో డిప్యూటీ కలెక్టర్ బాబ్జి ప్రజలతో చర్చించి సీసీ రోడ్లు, డ్రెయినేజీ ఎక్కడ వేయాలి అనేదానిపై ఒక నిర్ణయం తీసుకున్నారు. మండవల్లిలో మాత్రం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయానికి కూటమి నాయకులే తూట్లు పొడుస్తున్నారు. ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే లక్ష్యంతో తెలుగు తమ్ముళ్లు కాంట్రాక్టర్ అవతారమెత్తి కాంట్రాక్టులు పొంది అనుభవం, అర్హత లేకుండా నాసిరకంగా రోడ్ల నిర్మాణం చేపట్టేశారు. గాంధీ ఆశ్రమం నుంచి హైస్కూల్ వరకు సిమెంట్ రోడ్డు నిర్మించాలని అనుమతులు ఉన్నప్పటికీ తెలుగు తమ్ముళ్లు మార్చేసి సంపాదనే లక్ష్యంగా జాతీయ రహదారి నుంచి హైస్కూల్ వరకు ఉన్న సిమెంట్ రోడ్డుపైనే మరొక సీసీ రోడ్డు నిర్మించారు. దీంతో గాంధీ ఆశ్రమానికి వెళ్లే రహదారి అభివృద్ధి చెందకపోగా సుమారు రూ.18 లక్షలు దుర్వినియోగం అయ్యాయని ప్రజలు స్పష్టం చేస్తున్నారు. మరికొన్ని చోట్ల నిర్మించే సిమెంటు రోడ్లను వారికి నచ్చినట్లుగా నాసిరకంగా రోడ్ల నిర్మాణం చేస్తూ భారీగా ఉపాధి హామీ నిధులను పక్కదారి పట్టిస్తున్నారు. అడ్డుకోవలసిన అధికారులు, కూటమి నాయకుల సమక్షంలో ముందుగానే తెలుగు తమ్ముళ్లతో లక్షల్లో ఒప్పందం కుదుర్చుకుని చూసిచూడనట్లు వ్యవహరిస్తూ, సహకరించడం ప్రజలను విస్మయానికి గురిచేస్తుంది. దీంతో గడిచిన వైసిపి ప్రభుత్వంలో కనపడని అభివృద్ధి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కనిపిస్తుందనుకున్న ప్రజలకు కూటమి పార్టీల నాయకులు తీవ్ర నిరాశను మిగులుస్తున్నారు. కేవలం పెద్ద ఎత్తున నిధులు కాజేయాలనే లక్ష్యంతోనే సిమెంట్ రోడ్డుపై మరొక సిమెంట్ రోడ్డు వేశారని ప్రజలు స్పష్టం చేస్తున్నారు. మరికొన్ని సిమెంట్ రోడ్లలో సిమెంటు సమపాళ్లు లేకుండా నాసిరకం మిశ్రమాలతో రోడ్ల నిర్మాణాలు చేస్తున్నారని ప్రజలు చెబుతున్నారు. ఇలాంటి చర్యలతోనే మండల కేంద్రమైన మండవల్లి అభివృద్ధి నేటికీ పక్కదారి పట్టిస్తున్నారేంటని ప్రశ్నించిన వారిపై ఎదురుదాడికి దిగుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఐదేళ్లలో గ్రామాల్లో మట్టి రోడ్లు లేకుండా సిమెంట్ రోడ్లు నిర్మిస్తామని చెబుతున్న ఎంఎల్‌ఎ కామినేని శ్రీనివాస్ ఇటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే మరిన్ని నిధులు పక్కదారి పట్టే అవకాశం ఉందని ప్రజలు విమర్శలు వ్యక్త పరుస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి పూర్తిస్థాయి విచారించి, బిల్లులు నిలుపుదల చేసి, కాంట్రాక్టర్లకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై పంచాయతీరాజ్ శాఖ ఎఇ కమల్ రాజును వివరణ కోరగా గాంధీ ఆశ్రమం నుంచి హైస్కూల్ వరకు రహదారి అభివృద్ధికి అనుమతులు వచ్చిన మాట వాస్తవమేనని అన్నారు. అయితే ఆ రహదారి అభివృద్ధి చేయడం ఇప్పుడు కుదరదని, జాతీయ రహదారి నుంచి జిల్లా పరిషత్ హై స్కూల్ వరకు ఉన్న సీసీ రోడ్డుపైనే మరొక సీసీ రోడ్డు వేసిన మాట కూడా వాస్తవమేనన్న సమాధానం ఇచ్చారు.


అనుమతుల్లేకుండా వేసిన రోడ్డు

రోడ్డుమీద రోడ్డు వేయడం దారుణం


బుద్ధుల ఏసుపాదం



సీసీ రోడ్డుపైనే మరొక సీసీ రోడ్డు వేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారు అనేది అర్థం కావడం లేదు. చిన్న చినుకు పడితే చాలు రోడ్లన్నీ మోకాల్లోతు నీటిలో మునిగిపోతాయి. డ్రెయినేజీ లేకపోవడం వల్ల మురుగునీరు అంతా ఇళ్ల ముందే ఉంటుంది. రోడ్లు, డ్రెయినేజీ లేని చోట రోడ్లు, డ్రెయినేజీ నిర్మించకుండా, వేసిన రోడ్డు మీదే రోడ్డు వేయడం బాధాకరం.

అధికారుల నిర్లక్ష్యం అభివృద్ధికి ఆటంకం

బుద్ధుల రాముడు



అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించబట్టే మండల కేంద్రమైన మండవల్లి అభివృద్ధికి నోచుకోలేదు. గత ప్రభుత్వంలో నిధులు రాక ఇబ్బందులు పడితే ఇప్పుడు వచ్చిన నిధులను సక్రమంగా వినియోగించకపోవడంతో బాధ పడాల్సి వస్తుంది. గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ లేక అనేక ఇబ్బందులు పడుతున్నాం. డ్రెయినేజీ ఏర్పాటుకు అధికారులు సహకరించకుండా నిధులు దుర్వినియోగం అవుతుంటే చూసిచూడనట్టు వ్యవహరించడం సరైన పద్ధతి కాదు. జిల్లా అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలి.

బ్యాంక్ రుణాల మంజూరులో మహిళా సమాఖ్య ముందంజ

ఆగిరిపల్లి : బ్యాంక్ లింకేజీ రుణాలు మంజూరు చేయటంలోను, మంజూరు చేసిన రుణాలను రికవరీ చేయటంలోనూ మండల మహిళా సమాఖ్య జిల్లాలోనే ముందంజలో వుందని మండల వెలుగు ఏపిఎం డి.రాజశేఖర్ అన్నారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో ఎంఎస్ మహిళా కార్యదర్శి సయ్యద్ భాసిరా అధ్యక్షతన మండల మహిళా సమాఖ్య ఈసి కమిటీ సమావేశం నిర్వహించారు. స్వయం సహాయక సంఘ సభ్యులు తాము తయారు చేసిన ఉత్పత్తులను మై స్టోర్ యాప్ ద్వారా విక్రయించుకోవచ్చన్నారు, డ్వాక్రా ఉత్పత్తులను తయారు చేసే సభ్యులు తమ పేర్లు మై స్టోర్ యాప్‌లో నమోదు చేసుకోవాలని స్త్రీ నిధి మేనేజర్ గోపి కోరారు. ఏరియా కోఆర్డినేటర్ త్రిపుర సుందరావు మాట్లాడుతూ స్త్రీనిధి, ఉన్నతి, మొబైల్ బుక్ కీపింగ్ రుణాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. అనంతరం ఉల్లాస్ ప్రోగ్రాంకు సంబంధించిన అక్షర వెలుగులు సంక్షిప్త వాచకం పుస్తకాలను పంపిణీ చేశారు. వెలుగు సిసిలు విమ్మ, లక్ష్మి, హానిస్టన్ బీ, కంప్యూటర్ ఆపరేటర్ రాంబాబు, అకౌంటెంట్ రజిత, విఒ అధ్యక్షులు, స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మామిడి రైతులు అప్రమత్తంగా ఉండాలి

ఉద్యానశాఖాధికారి కె.జ్యోతి ప్రియాంక

ఆగిరిపల్లి : ప్రస్తుత వాతావరణ పరిస్థితులు తామర పురుగు పెరుగుదలకు అనుకూలంగా వుందని, కావున మామిడి రైతులు అప్రమత్తంగా వుండటంతో పాటు ముందస్తు నివారణా చర్యలు చేపట్టాలని మండల ఉద్యానశాఖాధికారి కె.జ్యోతి ప్రియాంక కోరారు. మంగళవారం ఆమె మండల పరిధిలోని సూరవరం, కృష్ణవరం గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో మామిడితోటలను పరిశీలించారు. తామర పురుగు నివారణకు ఒక లీటరు నీటికి 5 ఎం.ఎల్ వేపనూనె లేదా ఇమిడాక్లోరోపిడ్ 0.3 ఎంఎల్ ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, మామిడి రైతులు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

భీమడోలు : మండల పరిధిలో హైకోర్టు ఆదేశాల మేరకు కోడి పందేలు, ఇతర అసాంఘిక కార్యక్రమాలపై నిషేధం అమలు చేస్తున్నట్లు భీమడోలు తహశీల్దార్ బి.రమాదేవి తెలిపారు. ఈ మేరకు భీమడోలు మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో మంగళవారం వీటి నిరోధానికి ఏర్పాటుచేసిన మండల స్థాయి, గ్రామస్థాయి కమిటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమడోలు తహశీల్దార్ మాట్లాడుతూ పంట పొలాలు, తోటలు, బహిరంగ ప్రదేశాల్లో కోడిపందేలు, గుండాట, జూదం, అక్రమ మద్యం, ఇతర సాంఘిక కార్యకలాపాల నిర్వహణ-వీటి నిరోధానికి చట్టపరంగా తీసుకునే చర్యలపై విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలని కమిటీ సభ్యులను కోరారు. గ్రామస్థాయిలో ముందస్తు సమావేశాలు ఏర్పాటు చేసి ఇవి జరిగే అవకాశం ఉన్న స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేయాలని కోరారు. కోడిపందేలు వేసే వారిని గుర్తించండి, కోడి పందేలు, ఇతర సాంఘిక కార్యక్రమాలకు వినియోగించే వివిధ వస్తువులను పోలీసులకు అప్పగించవలసిందిగా తెలియజేయాలని చెప్పారు. ఎంపిడిఒ పద్మావతి దేవి, ఎస్ఐ సుధాకర్, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రమ్యశ్రీ పాల్గొన్నారు.

దెందులూరు : సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు నిర్వహించే వారిపై కేసులు నమోదు చేయాలని దెందులూరు తహశీల్దార్ సుమతి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని వీఆర్‌ఒలు, పోలీస్, ఇతర సిబ్బందితో కోడిపందేల నిరోధంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సుమతి మాట్లాడుతూ సంక్రాంతి సమయంలో కోడిపందేలను నిరోధించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ గేమింగ్ యాక్ట్, 1974, సెక్షన్ 9(1), సెక్షన్ 9(2) కోడిపందేలు నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. జిల్లా సొసైటీ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ క్రూయెల్టీటు యానిమల్స్(డిఎస్‌పిసిఎ) ఛైర్మన్‌గా జిల్లా కలెక్టర్ నిషేధ ఆజ్ఞలు ఇచ్చారన్నారు. స్థానిక పశుసంవర్ధక శాఖ అధికారులు, స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులతో కూడిన ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ బృందాలు గ్రామ స్థాయిలో జరుగుతున్న కోడిపందేల నిర్వహణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తాయన్నారు. కోడిపందేల నిర్వహించకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవడం, నిర్వహించే వారిపై కేసులు నమోదు చేయడం చేస్తాయన్నారు.

10న సమ్మె ఒప్పందాల అమలుకు రిలే దీక్షలు

ఏపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్

ఏలూరు అర్బన్: ప్రభుత్వం సమ్మె కాలపు ఒప్పందాల జీఓ అమలు చేయకపోవడంతో, ఆ జీఓల అమలు కోసం ఈ నెల 10న చేపట్టనున్న రిలే నిరాహార దీక్షల్లో కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు బి.సోమయ్య, అధ్యక్షులు బి.బాలరాజు, ప్రధాన కార్యదర్శి ఎ.జాను బాబు మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఎక్స్‌గ్రేషియా, దహన సంస్కారాలకు రూ.20 వేలు, ఇంజినీరింగ్ కార్మికుల జీతాల పెంపు, సంక్షేమ పథకాల అమలు, పర్మినెంట్ కార్మికులకు సరెండర్ లీవ్‌ల తదితర హామీలకు సంబంధించి వెంటనే జీఓలు జారీ చేయాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కొరకు గతడిచిన సమ్మె ముగిసిన రోజైన జనవరి 10న అన్ని మున్సిపల్ కార్యాలయాల వద్ద రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేరాలు - ఘోరాలు

పాము కాటుతో మహిళ మృతి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం పట్టణంలో మంగళవారం పాముకాటుతో ఒక మహిళ మరణించిన విషాదకర ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే స్థానిక ఎస్‌సి కాలనీకి చెందిన ఆడమెల్లి ఆశాజ్యోతి, భర్త చిరంజీవితో కలిసి కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తుండేది. ఈమెకు ముగ్గురు కుమారులు ఉన్నారు. సోమవారం రోజు ఆశాజ్యోతి కొయ్యలగూడెంలో కూలీ పనికి వెళ్లింది. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో బ్యారన్ పుల్లల్లో ఉన్న పాము ఆమె తలపై కాటు వేసింది. దాంతో ఆమె వెంటనే తోటి మహిళలకు ఈ విషయాన్ని తెలిపింది. వారు ఆశాజ్యోతిని తక్షణమే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆసుపత్రిలో వైద్యులు ఇంజక్షన్ చేసి, జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స చేసిన వైద్యులు ఆమె పరిస్థితి విషమంగా ఉందని, వెంటనే ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. కానీ, పరిస్థితి మరింత విషమించడంతో దగ్గర్లోని జంగారెడ్డిగూడెంలోని ఒక ప్రయివేటు ఆసుపత్రికి ఆమెను తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఆశాజ్యోతి మరణించింది. ఆమె మరణం తోటి మహిళలతో పాటు ఎస్‌సి కాలనీ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. గ్రామస్తులు కన్నీరు మున్నీరయ్యారు.

కళ్లలో కారం కొట్టి వ్యక్తిపై దాడి

నూజివీడు టౌన్ : కళ్లల్లో కారం కొట్టి వ్యక్తిపై కత్తితో దాడి చేసిన సంఘటన నూజివీడు పట్టణంలో మంగళవారం తీవ్ర సంచలనం కలిగించింది. నూజివీడు పట్టణ పరిధిలోని కృష్ణ విలాస్ కాలనీ చిరు వ్యాపారి పులేరు వెంకట సాంబశివరావుపై పాత తగాదా నేపథ్యంలో బాబి అనే వ్యక్తి కళ్లల్లో కారం కొట్టి, ముసుగు వేసి కత్తితో దాడి చేసినట్లు బాధితుడు సాంబశివరావు తెలిపారు. కత్తిపోట్లతో తీవ్ర గాయాలపాలైన సాంబశివరావును సమీపంలోని వారు నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తండ్రి దండించడంతో కుమారుడి మృతి

నూజివీడు టౌన్ : మండలంలోని మర్రిబంధం గ్రామంలో వ్యసనాలకు గురైన కుమారుడిని తండ్రి మందలించగా మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. అప్పికొండ నాగభూషణం(35) మద్యం కోసం తండ్రి గోవిందుని డబ్బులు ఇవ్వమని వేదించగా, దండించడంతో నాగభూషణం గాయాలపాలయ్యాడు. ఆసుపత్రికి తరలిస్తుండగా నాగభూషణం మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సంఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది.

రైలు ఢీకొని వృద్ధుడు మృతి

ఏలూరు స్పోర్ట్స్ : రైలు ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన ఏలూరు నగరంలోని గన్ బజార్ సమీపంలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేలూరు నగరంలోని పెన్షన్ లైన్ ప్రాంతానికి చెందిన ఎండి నసీం(60) స్థానికంగా నివసిస్తూ కుటుంబ సభ్యులతో కలిసి జీవిస్తున్నాడు. ఈ క్రమంలో గన్ బజార్ సమీపంలో అతను మంగళవారం రైలు పట్టాలు దాటుతున్న సమయంలో గుర్తుతెలియని రైలు బండి అతన్ని ఢీకొంది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గుర్తించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై రైల్వే ఎస్ఐ సైమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పౌర సరఫరాను సక్రమంగా నిర్వహించాలి : జెసి

ప్రజాశక్తి - ఏలూరు

సివిల్ సప్లై సక్రమంగా నిర్వహించేందుకు డీలర్లంతా కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి సూచించారు. జిల్లా డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మంగళవారం జిల్లా అధికారులకి నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. తొలుత జెసి ధాత్రిరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తర్వాత డిఎస్ఒ సత్యనారాయణ రాజు, డిఎంవి.శ్రీలక్ష్మి, ఎఎస్ఒ ప్రతాప్ రెడ్డిలను కలిసి అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో జిల్లా ముఖ్య కార్యదర్శి అత్తలూరి ఉదయేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కొలుసు లక్ష్మణరావు, కోశాధికారి కె.నాగరాజు, జాయింట్ సెక్రెటరీ బి.కోటేశ్వరరావు, గిరి, నూజివీడు ఏసు, మహిళా అధ్యక్షురాలు పిల్లా రాజరాజేశ్వరి, హరికృష్ణ, భాషా ఉన్నారు.

ఐలు క్యాలెండర్ ఆవిష్కరణ

ఏలూరు : ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) వాల్ క్యాలెండర్ జిల్లా న్యాయమూర్తి చింతలపూడి పురుషోత్తం కుమార్ తమ ఛాంబర్‌లో జిల్లా కమిటీ సభ్యుల సమక్షంలో ఆవిష్కరించారు. జిల్లా జడ్జి పురుషోత్తం కుమార్ క్యాలెండర్ ఆవిష్కరిస్తూ ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ న్యాయవాదులకు జూనియర్ సివిల్ జడ్జ్ పరీక్షలు నిర్వహించడంలోనూ, న్యాయ సంబంధమైన అనేక సెమినార్లు నిర్వహించడంలోనూ చాలా చురుకైన పాత్ర నిర్వహిస్తుందన్నారు. ప్రతి సంవత్సరం న్యాయవాదులకు మార్గదర్శకంగా ఉండే క్యాలెండర్స్ విడుదల చేయటం అభినందనీయమని అన్నారు. ఐలు జిల్లా సహాయ కార్యదర్శి కట్టా సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్ గెద్దా విజయభాస్కర్, సభ్యులు వై.శిరీష, జిఎస్.రెడ్డి పాల్గొన్నారు.

డిఎఫ్ఒను కలిసిన అటవీశాఖ ఉద్యోగులు

జీలుగుమిల్లి : జిల్లా అటవీశాఖ అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శుభమ్‌ను మంగళవారం జీలుగుమిల్లి అటవీ శాఖ ఉద్యోగుల అసోసియేషన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసినట్లు ఆ సంఘం అధ్యక్షుడు కె.రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ శాఖ అధికారికి పూల మొక్కను అందజేసి అభినందనలు తెలిపారు. డిఎఫ్ఒను కలిసిన వారిలో అధ్యక్షులు కె.రాంబాబు, ఉపాధ్యక్షులు వి.ఏసు పండు, జనరల్ సెక్రటరీ ప్రసాద్, జాయింట్ సెక్రటరీ డి.శ్రీను, ట్రెజరర్ జి.మారేష్ ఉన్నారు.



రమణక్కపేటలో బ్రెయిలీ జన్మదిన వేడుకలు

ఘనంగా లూయిస్ బ్రెయిలీ పుట్టినరోజు

ముసునూరు : అంధుల కోసం లిపిని కనిపెట్టి, వారి చీకటి జీవితాల్లో వెలుగులు నింపిన మహాజ్ఞాని లూయిస్ బ్రెయిలీ అని రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పివిఎస్.రామకృష్ణ అన్నారు. మంగళవారం రమణక్కపేట మెయిన్ స్కూల్‌లోని భవిత సెంటర్‌లో లూయిస్ బ్రెయిలీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సురేష్ బాబు మాస్టర్, కొండయ్య మాస్టర్, దాసు, లక్ష్మీ నారాయణ రావు, నాగమల్లేశ్వరి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్కౌట్ మాస్టర్, గైడ్ కెప్టెన్‌లకు శిక్షణ

దెందులూరు: స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా విద్యార్థులకు సమాజసేవలో భాగస్వామ్యం కల్పించి, ఉన్నత విలువలు పెంపొందించవచ్చని స్కౌట్ కార్యదర్శి ఐ.భాస్కర్ అన్నారు. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలోని పియంశ్రీ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు స్కౌట్స్ మాస్టర్, గైడ్స్ కెప్టెన్లుగా పనిచేయడానికి ఏడు రోజులపాటు శిక్షణ కార్యక్రమం ఏలూరు సమీపంలోని వేగవరంలో హేలాపురి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్కౌట్ కార్యదర్శి ఐ.భాస్కర్ మాట్లాడుతూ స్కౌట్స్, గైడ్స్ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, స్వీయ అభివృద్ధి, సమాజసేవ వంటి మంచి లక్షణాలు అలవడి పరిపూర్ణ, మానసిక పరివర్తన తీసుకురావచ్చని అన్నారు. కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులకు ప్రథమ చికిత్స, వివిధ ముడులు, టెంట్ కట్టుకునే విధానం, వివిధ అంశాలలో శిక్షణ ఇవ్వటం జరిగింది.

వివేకానందుని జీవిత చరిత్రపై పరీక్షలు

కలిదిండి : మండలంలోని కోరుకొల్లు క్రాంతి హై స్కూల్‌లో వివేకానందుని జీవిత చరిత్రపై 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పేర్ల రామ్ తేజ, జంగం సుశాంత్, ఫిరంగి ప్రవీణ, జడ్డు వినయ్ బహుమతులు సాధించినట్లు కరస్పాండెంట్ చెన్నంశెట్టి కృష్ణ తెలిపారు. విజేతలైన విద్యార్థులను ప్రిన్సిపల్ చెన్నంశెట్టి అజేష్ బాబు, కరస్పాండెంట్ చెన్నంశెట్టి కృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

వయోజన విద్య అక్షరాస్యత వాలంటీర్లకు పుస్తకాల పంపిణీ

దెందులూరు: వయోజన విద్య ఉల్లాస్ అక్షరాస్యత ద్వారా శిక్షణ పొందిన డ్వాక్రా వాలంటీర్లు, నిరక్షరాసులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని జిల్లా వయోజన విద్య నోడల్ అధికారి కెవివి.సత్యనారాయణ అన్నారు. భీమడోలు మండలంలోని డ్వాక్రా గ్రూపు మహిళలకు మొదటి విడతగా 270 మంది నిరక్షరాసులను గుర్తించి, వీరందినీ అక్షరాస్యులుగా చేసేందుకు 27 మంది వాలంటీర్లు నియమించినట్లు ఎపిఎం సురేష్ కుమార్ తెలిపారు. వీరంతా ఆయా గ్రామాల్లోని నిరక్షరాసులకు 3 నెలల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించి, ఉత్తీర్ణత కోసం పరీక్షలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా సిసిలు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్‌లు

ఏలూరు స్పోర్ట్స్ : పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల ఫిజికల్ ఫిట్నెస్ టెస్టులు మంగళవారం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా ముగిశాయి. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయ మైదానంలో గతనెల 30వ తేదీ నుంచి పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థుల ఫిజికల్ ఫిట్నెస్ టెస్ట్‌లు జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ సారథ్యంలో నిర్వహిస్తున్నారు. ఈ ఫిట్నెస్ టెస్టులు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. 600 మంది పురుష అభ్యర్థులకు ఫిజికల్ ఫిట్నెస్ టెస్టుల్లో పాల్గొనేందుకు హాల్ టికెట్లు మంజూరు చేశారు. ఇందులో 419 మంది అభ్యర్థులు మాత్రమే ఈ ఫిజికల్ పెట్టిన టెస్ట్‌లకు హాజరయ్యారు. వారిలో 270 మంది అభ్యర్థులు మాత్రమే అర్హత సాధించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ ఫిజికల్ ఫిట్నెస్ టెస్టులకు హాజరయ్యే అభ్యర్థులకు మౌలిక వసతులు ఏర్పాట్లు పూర్తిగా పోలీసు శాఖ నిర్వహిస్తుందని తెలియజేశారు. మంగళవారం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా టెస్ట్‌లు ముగిశాయని తెలిపారు. ఈ ఫిట్నెస్ టెస్ట్‌లు ఈనెల తొమ్మిదో తేదీన ముగియనున్నాయని ఆయన తెలిపారు. ఏదైనా కారణాలవల్ల ఈ టెస్టులకు హాజరుకాని అభ్యర్థులు తొమ్మిదో తేదీన టెస్టులకు హాజరు అయ్యేవిధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎఆర్, సివిల్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లకు మోక్షం

ఎంఎల్‌ఎ చొరవతో హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు


నాడు..

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలో ఎంఎల్‌ఎ సొంగా రోషన్ కుమార్ చొరవతో రోడ్లకు మోక్షం లభించింది. గత ప్రభుత్వ హయాంలో మండలంలో ఎక్కడ చూసినా గుంతలతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ద్విచక్ర వాహనం నడపడానికి కూడా నరకంగా ఉండేది. కనీసం గుంతలు కూడా పుడ్చని పరిస్థితి నెలకొంది. దీంతో 5 సంవత్సరాలుగా ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. 2024 ఎన్నికలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత చింతలపూడి నియోజకవర్గం ఎంఎల్‌ఎ సొంగా రోషన్ కుమార్ ముందుగా గుంతలపై దృష్టి పెట్టి చింతలపూడికి అదనపు నిధులు తీసుకువచ్చారు. గుంతలు కనిపిస్తే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరికల నేపథ్యంలో గుంతలు కనిపించకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఎన్నో సంవత్సరాల తరువాత రేచర్ల రోడ్డుకి మోక్షం కలిగింది. గతంలో ఈ రోడ్డు వెంబడి ప్రయాణించాలి అంటే ప్రజలు ఇబ్బందిపడేవారు. వర్షం వస్తే చాలు వాహనాలు వెళ్లటానికి కూడా వీలు లేకుండా ఉండే పరిస్థితి నెలకొంది. ఇప్పుడు ఈ రోడ్డుకు మోక్షం కలిగింది. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


నేడు..

అంటువ్యాధుల నిర్మూలనలో ఆశాల పాత్ర కీలకం

అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అంటువ్యాధి అరికట్టడంలో ఆరోగ్య, ఆశ కార్యకర్తల పాత్ర చాలా కీలకమని, సమన్వయంతో పనిచేసి డిపార్ట్మెంట్‌కి, జిల్లాకి మంచి పేరు తీసుకురావాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. ఏలూరులోని అర్బన్ కేంద్రాలలో జరుగుతున్న ఆశ డే కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వాతావరణంలో అనేక రకాల వైరస్‌లు, బ్యాక్టీరియాలు మన మీద దాడి చేసే అవకాశం ఉందని, తద్వారా అనేక రకాల అంటు వ్యాధులు, డెంగీ, చికెన్‌గునియా, మలేరియా, కోవిడ్, ప్రస్తుతం ప్రబలుతున్న హెచ్‌ఎంటివి వైరస్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. తద్వారా ప్రజల్లో ధైర్యం నింపాలని, అది ఇంటింటికీ సందర్శించే ఆరోగ్య, ఆశ కార్యకర్తల వల్లే సాధ్యమవుతుందని అన్నారు. అనేక జాతీయ కార్యక్రమాలైన వ్యాధుల టీకాలు, డెంగీ, మలేరియా నిర్మూలన కార్యక్రమంలోనూ, ఫైలేరియా, లెప్రసీ నిర్మూలన కార్యక్రమంలోనూ, గర్భిణుల సంరక్షణలోనూ, హెచ్ఐవి ఎయిడ్స్ అరికట్టుటలోను, ఆరోగ్య, ఆశ కార్యకర్తల భాగస్వామ్యం కీలకమని సూచించారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలోను అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మలేరియా హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు, వైద్యాధికారులు డాక్టర్ గౌతమ్, డాక్టర్ నికిత, డాక్టర్ మానస, హెల్త్ సూపర్వైజర్స్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గోవిందరావు

యుటిఎఫ్ స్వర్ణోత్సవ క్రీడా పోటీల్లో ఉపాధ్యాయుల సత్తా


ఎంఎల్‌సి నుంచి బహుమతులు అందుకుంటున్న రామారావు

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని నారాయణపురం హైస్కూల్ సాంఘిక శాస్త్ర స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు గొల్లపల్లి రామారావు యుటిఎఫ్ స్వర్ణోత్సవాల క్రీడా పోటీలలో 40 సంవత్సరాల విభాగంలో 100 మీటర్ల రన్నింగ్‌లో సెకండ్, 400 మీటర్ల నడకలో ప్రథమ బహుమతులు ఎంఎల్‌సి లక్ష్మణరావు చేతులమీదుగా అందుకున్నారు. రామారావుకి ఏలూరు జిల్లా అధ్యక్షులు ఆలీ, ప్రధానకార్యదర్శి రవికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

మండలంలోని ఉప్పాకపాడు ఉపాధ్యాయులు అల్లు శ్రీనుకి కాకినాడలో జరుగుతున్న యుటిఎఫ్ స్వర్ణోత్సవాలలో సాంస్కృతిక పోటీల విభాగంలో మూకాభినయంలో ద్వితీయ, బుర్రకథలో ప్రథమ బహుమతులు ఎంఎల్‌సి లక్ష్మణరావు చేతులమీదుగా సోమవారం రాత్రి అందుకున్నారు. యుటిఎఫ్ ఐక్య ఉపాధ్యాయ మాసపత్రిక నిర్వహించిన కథలపోటీలో అల్లు శ్రీను రాసిన కథకు తృతీయ బహుమతిగా రూ.3 వేల ప్రైజ్ మనీ, సర్టిఫికెట్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు, ప్రధానకార్యదర్శి కెఎస్.ప్రసాద్ చేతులమీదుగా అందజేశారు. అల్లు శ్రీను మాట్లాడుతూ తనకు వచ్చిన ప్రైజ్‌మనీ మూడువేలను పేద వృద్ధులకు చీరలు పంచిపెడతానన్నారు. అల్లు శ్రీనుకి యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆలీ, ప్రధానకార్యదర్శి రవికుమార్, ఉంగుటూరు మండల విద్యాశాఖాధికారులు నిమ్మగడ్డ రవీంద్ర భారతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలియజేశారు.


బహుమతి అందుకుంటున్న అల్లు శ్రీను

మహిళలకు ముగ్గుల పోటీలు

9వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి
ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడిలో జరిగే ముగ్గుల పోటీల్లో మహిళలందరూ అధిక సంఖ్యలో పాల్గొని సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకుందామని చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్‌ఎ సొంగ రోషన్ కుమార్ పిలుపునిచ్చారు. ఒక ప్రకటనలో ఆయన తెలిపిన వివరాల ప్రకారం ముగ్గుల పోటీల్లో పాల్గొనే మహిళలందరూ 9వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని అన్నారు. ప్రతి ఇంటి ముందు ముగ్గు వేసి 12వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి 13వ తేదీ ఉదయం ఏడు గంటల లోపు మండలానికి కేటాయించిన కార్యాలయం వారి రిజిస్ట్రేషన్ నెంబర్ 9996368999 ఫొటో తీసి వాట్సఅప్ ద్వారా పంపించాలని కోరారు. ఇందులో మొదటి, రెండవ, మూడవ బహుమతులు ఉంటాయని, స్వయంగా వారికి ఎంఎల్‌ఎ దంపతులు ఇంటికి వచ్చి బహుమతులు అందజేస్తారని తెలిపారు. ముగ్గుల పోటీలో పాల్గొనే మహిళలు, రిజిస్ట్రేషన్ కోడ్ ఇవ్వబడుతుందని, స్వయంగా పరిరక్షణ చేయబడుతుందని తెలిపారు. మరో 10 మందికి కన్సిలేషన్ కింద బహుమతులు అందజేస్తారన్నారు. అదేవిధంగా 11వ తేదీన చింతలపూడి నియోజకవర్గం రైతులకు ట్రాక్టర్, ఎడ్ల బండి షో నిర్వహించబడుతుందని, ట్రాక్టర్లను, ఎడ్లబడ్లను అందంగా అలంకరించిన రైతులకు, మొదటి రెండవ మూడో బహుమతులు అందజేస్తారని, మరో 10 మందిని కన్సలేషన్ కింద బహుమతులు అందజేస్తామని ఎంఎల్‌ఎ తెలిపారు. పోటీలో పాల్గొనేవారు ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. 12వ తేదీ ఆదివారం చెలికాని గ్రౌండ్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించబడుతున్నాయని, ప్రజలందరూ పాల్గొని సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పాల్గొవాలని పిలుపునిచ్చారు.

హెచ్‌ఎంపివిపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో హెచ్‌ఎంపివి వైరస్‌పై అవగాహనా ర్యాలీని మంగళవారం రెడ్ క్రాస్ వాలంటీర్లు స్థానిక ప్రభుత్వాసుపత్రి నుంచి ఫైర్ స్టేషన్ మీదగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ హెచ్‌ఎంపివి వైరస్‌పై ఆందోళన చెందవలసిన అవసరం లేదని, ఈ వైరస్‌పై అవగాహన కలిగి ఉండి, మాస్కులు ధరించడం, సామాజిక దూరాన్ని పాటించడం, చేతులు శుభ్రపరచుకోవడం, జన సందోహాలకు దూరంగా ఉండటం వంటివి చేస్తే సరిపోతుందని అన్నారు. ప్రస్తుత శీతకాలం దృష్ట్యా వేడి ఆహార పదార్థాలు, పానీయాలు సేవించడం మంచిదన్నారు. చిన్నపిల్లలు, వయోవృద్ధులు, ఇతర శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న వారు జాగ్రత్తలు పాటించాలని కృష్ణారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా రోడ్లపై వెళ్లే పాదచారులకు, వాహనదారులకు 400 మందికి మాస్కులను పంపిణీ చేశారు. రెడ్ క్రాస్ సభ్యుడు ఆర్ఎన్ఆర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ అందరూ కలిసి సమిష్టిగా జాగ్రత్తలు పాటిస్తూ హెచ్‌ఎం పివి వైరస్ వ్యాప్తిని అరికట్టవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ కార్యదర్శి కెబి.సీతారాం, ఆర్ఎన్ఆర్ నాగేశ్వరరావు, టి.రామారావు, డిఆర్‌సిహెచ్ నారాయణ, డాక్టర్ జి.స్పందన, పిఆర్ఒకెవి రమణ, రెడ్ క్రాస్ నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది

పంట బీమా తప్పనిసరి

ప్రజాశక్తి - ముసునూరు

ప్రతి ఒక్క రైతు తాము వేసిన పంటను బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి సూరిబాబు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సూరేపల్లి, రమణక్కపేట గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు వేసిన పంటను బట్టి ప్రీమియం చెల్లించుకోవాలని, మొక్కజొన్న పంటకు రూ.483, మినుములు రూ.60, వరి పంట రూ.500, మామిడి పంటకు రూ.2,250, మిగతా పంటలకు ఆయా గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో, సచివాలయ సిబ్బందిని అడిగి పంట ధృవీకరణ పత్రం కూడా తీసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన

భీమడోలు : కిశోర బాలికలు మంచి-చెడు స్పర్శల మధ్యగల అంతరాయం గురించి అవగాహన కలిగి ఉండాలని ఎంపిడిఒ పద్మావతి దేవి కోరారు. భీమడోలు హైస్కూల్లో మంగళవారం సాయంత్రం కిశోర్ బాలికా వికాసం 2.0 కార్యక్రమంపై అవగాహనా సదస్సును నిర్వహించి అవగాహన కల్పించారు.

భూ సమస్యల పరిష్కారానికి గ్రామసభలు

మండవల్లి: భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడానికి గ్రామసభలు నిర్వహిస్తున్నామని తహశీల్దార్ కె.గోపాల్ స్పష్టం చేశారు. మండలంలోని చావలిపాడులో మంగళవారం ఆయన అధ్యక్షతన రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించారు. సర్పంచి ఆర్ఎస్.శ్రావణి, విఆర్ఒ మరియమ్మ, కార్యదర్శి రామ్మూర్తి పాల్గొన్నారు.

దెందులూరు: భూ సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయాలని దెందులూరు తహశీల్దార్ బి.సుమతి ప్రజలకు సూచించారు. మండల కేంద్రంలో మంగళవారం రెవెన్యూ గ్రామ సదస్సు జరిగింది. సదస్సుకు దెందులూరు తహశీల్దార్ సుమతి అధ్యక్షత వహించి మాట్లాడారు. దెందులూరు గ్రామంలో రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలు తెలుపుతూ అర్జీ పెట్టాలని, ఆ సమస్యలను నమోదు చేసుకుని నిర్ణీత వ్యవధిలో పరిష్కరిస్తామని ఆమె తెలిపారు. గ్రామంలో పాస్ బుక్‌లు లేక ఇబ్బందులు పడుతున్న రైతులు తమ వివరాలు తెలియజేయాలని అన్నారు. సాగులో ఉన్న రైతుల వివరాలు రెవెన్యూ రికార్డులలో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. కొంత మంది రైతుల వివరాలు అడంగల్ రికార్డుల్లో కూడా నమోదు కానీ వారు ఉంటే అటువంటి రైతులు అర్జీలు పెట్టు కావాలని సూచించారు.

చిన వెంకన్న హుండీ ఆదాయం

రూ.3,85,61,549

ద్వారకాతిరుమల : జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం హుండీలు మంగళవారం ఉదయం ప్రమోద మండపంలో అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ లెక్కింపు జరిపారు. ఈ హుండీల లెక్కింపు ద్వారా స్వామి వారికి గడచిన 40 రోజులకు రూ.3,85,61,549 ఆదాయం వచ్చింది. అలానే భక్తుల కానుకల రూపేణ 383 గ్రాముల బంగారం, 12 కేజీల 8 గ్రాముల వెండి, పాత రూ.500(23నోట్లు), రూ.1000(4 నోట్లు), రూ.2000(7 నోట్లు) పలు దేశాల విదేశీ కరెన్సీ సైతం లభించినట్లు తెలిపారు. ఈ హుండీల లెక్కింపులో ఆలయ సిబ్బంది, అధికారులు, అర్చకులు పాల్గొన్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాథరావు తెలిపారు.

రంగోత్సవ్‌లో త్రివిధ విద్యార్థుల ప్రతిభ

నూజివీడు టౌన్ : అంగలూరు డైట్ కళాశాలలో నూజివీడు త్రివిధ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి రంగోత్సవ్‌లో బహుమతులు సాధించినట్లు త్రివిధ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ తెలియజేశారు. క్విజ్ మొదటి బహుమతి, చేతి రాత మొదటి బహుమతి, డిజిటల్ డ్రాయింగ్ మొదటి బహుమతి, నినాదాలు చెప్పటంలో మొదటి బహుమతి, డ్రాయింగ్‌లో రెండవ బహుమతి, ఏకపాత్రాభినయం రెండవ బహుమతి పొందారు. అనంతరం విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

ట్రైనింగ్ సెంటర్లను వినియోగించుకోవాలి

కలిదిండి : చేతివృత్తి దారులు ట్రైనింగ్ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర నాయి బ్రాహ్మణ వెల్ఫేర్, డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు అన్నారు. కైకలూరు విద్యాంజలి కళాశాల ఆవరణలో విశ్వకర్మ యోజన ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గ నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కొత్తపల్లి విజయ్ కుమార్, మలువల అచ్చారావు పాల్గొన్నారు.

హరిబాబు, నరసింహారావులకు సత్కారం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

జిల్లా వైసిపి ఆర్గనైజింగ్ సెక్రటరీగా, ఉపాధ్యక్షులుగా నియమితులైన మండల పరిధిలోని గొల్లగూడెంకు చెందిన మచ్చా హరిబాబు, చిన్నాగిరిపల్లికి చెందిన పల్లగాని నరసింహారావులను మంగళవారం మండల వైసిపి ఎస్‌సి సెల్ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఎస్‌సి సెల్ నాయకులు ఎం.రవిశేఖర్, కె.ప్రదీప్, ఎన్.కాంచనరావు, బి.తిరపతిరావు, కె.వీరాస్వామి, ఎల్.లాజర్, ఎల్.సుధీర్, వి.సక్కేశ్వరరావు, ఎస్‌కె.సుభానీలు పాల్గొన్నారు.